ఆయన ముఖంలో దివ్యతేజస్సు అవతార పురుషునిలా ఉన్నా రాయన. సినిమాల్లో పిల్ల హీరోయిన్లతో కుప్పిగంతులు వేసేది ఈయనేనా? అనిపించింది నాకు. ఆయన కళ్ళల్లో స్థిరనిశ్చయం, ఏదోచేయాలనే తపన, హాయిగా సినిమాల్లో రాజభోగాలు అనుభవించక ఎందుకండీ మీకు ఇదంతా చెప్పాలనిపించింది నాకు.

"నాన్నగారూ నేను దండ వెయ్యను ఈయన ఎన్టీఆర్ కాదు, అన్నాడు మాబాబు.

కాదు నాన్నా ఈయనే ఎన్టీఆర్, సినిమాల్లో వేషాలేస్తే అలా వుంటారు, అని ఏదో చెబుతున్నాను.

అబ్బ అదేంకాదు. ఈయన టైగరు కేడీనెంబరు వన్, సూపరు మెన్, బొబ్బిలిపులిలోలా లేడుగా ఈయన ఎన్టీఆర్ కాదు అని ముఖం ముడుచుకున్నాడు.

ఇంక నేను చెప్పేదేముంది

నేనే ఆదండ వేసేను.

—o—

# "సితార"

సితారగారు మీకు "రంభ" ఎవార్డ్ వచ్చినపుడు ఎలా ఫీలయ్యారు? ప్రఖ్యాత నటి సితారకు అంతర్జాతీయ ఎవార్డ్ "రంభ" వచ్చిన సందర్భం లో ఒక విలేఖరి ఈ ప్రశ్నతో ప్రారంభించాడు సమావేశం.

సితార వయ్యారంగా కుర్చీలోంచి కదిలి "నేను నా మాతృభాష కన్నడంలో ఎన్ని సినిమాలు నటించినా నాకు ఎవార్డ్ రాలేదు. కానీ తెలుగు చిత్రంలో ఈ ఎవార్డు వచ్చినందుకు నా సంతోషం మీకు మాటల్లో చెప్ప లేను" అంది ఆమె మాతృభాషలో

మరో ప్రశ్న మీరు నటనలో ఇంతటి పరాకాష్టకు చేరుకోడానికి మీకు ప్రేరణ ఎవరు?"

మా "అమ్మ"

విలేఖరులు నవ్వి, కాదు నటనలో చెప్పండి. అన్నారు అయ్‌మీన్ అంటూ స్వర్గీయులైన ప్రముఖ నటీమణుల పేర్లు చెప్పింది.

"మరో ఆసక్తికరమైన ప్రశ్న మీరు వివాహం ఎప్పుడు చేసుకుంటారు"?

పకపకానవ్వింది టూత్‌పేస్టు ప్రకటనకోసం నవ్వినట్లు

"నేను చాలా చిన్నదాన్ని మా అమ్మను అడగాలి"

"చివరగా మంచి ప్రశ్న మీకు అవార్డు తెప్పించిన ఈ చిత్రంలో మీ నటన అద్భుతం అని మరోసారి చెప్తున్నాం. అయితే సమాజంలో భర్తవదిలేసిన స్త్రీగా సాటి స్త్రీలు మిమ్మల్ని అసహ్యించుకుంటున్నాసరే, ఎంతో ధైర్యంగా పోరాడిన స్త్రీగా మీరు ఎంతో అపూర్వంగా నటించారు కాదు జీవించారు. దీనికి కారణం ఏమిటంటారు?"

"వెరీ సింపుల్ నేను నటననే దైవంగా భావిస్తాను. ఈ సువిశాల నటనాలయంలో నేను పూజారిణిని" అంటూ వయ్యారంగా లేచి తిప్పుకుంటూ "బై" అంటూ విలేఖరులందర్ని ఒక్కసారి కలయచూసి, సమ్మోహనంగా వెళ్ళిపోయింది సితార లోపలకి.

సితార పనమ్మాయి బయటికి వచ్చింది డ్రింకులతో. అందరికి డ్రింకులిచ్చాక "బాబయ్య అమ్మగారిని వదిలేసిన భర్తగారొచ్చి డబ్బుకోసం ఆమెను వేధిస్తున్నారు. ఇప్పుడేం ఇంటర్వ్యూ బాబూ చాల్లేండి" అంటూ గ్లాసులు పట్టుకెళ్ళిపోయింది.

ఉత్తమనటి ఎవార్డు రావడానికి ముఖ్యకారణం, ప్రేరణ ఎవరో ఇప్పుడు విలేఖరులకు అర్ధమైంది.

—o—